# ఇన్లాండ్ లెటర్ కథలు

## ఆదర్శం

మామగారు కట్నంగా ఇచ్చిన సొమ్ము మొత్తానికి కూడబెట్టి బ్యాగ్‌లో పెట్టుకుని ఆటోని కేకేసి ఇంటి అడ్రస్ చెప్పి రిలాక్సింగ్‌గా వెనక్కివాలి కూర్చున్నాడు ఆనంద్.

అతనికి గతమంతా కళ్లముందు మెదిలింది. ఆనంద్‌కి ఓ మంచి ప్రయివేటు కంపెనీలో ఇంటర్వ్యూ వచ్చింది. అందులో సెలెక్ట్ అయ్యాడు కానీ 'డిపాజిట్' గా కొంత డబ్బు అవసరం అయింది. ఇంతలో ఆనంద్‌కి ఓ పెళ్లి సంబంధం వచ్చింది. అమ్మాయి పేరు 'వసంత' అనీ, ఫోటో కూడా తెచ్చారు. అమ్మాయి చాలా అందంగా ఉంది. ఇంట్లో అందరూ కట్నం డబ్బుతో ఉద్యోగం సంపాదించుకొమ్మని సలహా ఇచ్చారు. తనకి కట్నం తీసుకోవడం ఇష్టంలేకపోయినా పరిస్థితుల వల్ల తల వంచవలసి వచ్చింది.

అయితే మామగారు, బాబూ! మా అమ్మాయి కట్నం ఇవ్వడానికి వ్యతిరేకి. చదువుకునే రోజుల్నుంచీ డిబేటుల్లో పాల్గొని అదే పట్టుక్కూర్చుంది. అందువల్ల ఈ విషయాలు ఆమెకు తెలియనీకు. కానీ మీ కోరిక నేను తీరుస్తాను అని చెప్పాడు. తరువాత వారం రోజుల్లోనే మంచి ముహూర్తం ఉండటంతో అదే ఖాయం చేశాడు.

పెళ్లిలో తమది 'ఆదర్శ వివాహం' అని తన ఫ్రెండ్స్, వసంత ఫ్రెండ్స్ పొగడుతూ ఉంటే తను చాలా గిల్టీగా ఫీల్ అయ్యాడు. ఆ రోజే ఓ నిశ్చయానికి వచ్చాడు. మామగారి డబ్బు అప్పుగా భావించి తీర్చేయాలనుకున్నాడు. ఇప్పటికి తన కోరిక తీరబోతుంది. ఇంతలో ఇల్లు రావడంతో ఆటో దిగి ఇదంతా వసంతతో చెప్తే ఏమనుకుంటుందో అనుకుంటూ లోపలికి నడిచాడు.

అంతా విన్న వసంత తేలిగ్గా కొట్టి పారేస్తూ మనది 'ఆదర్శ వివాహం' గా రావలసిన పేరురానే వచ్చింది. ఇంక ఈ డబ్బు మా నాన్న కివ్వడం ఎందుకు? అందరూ ఇచ్చినట్టే నాన్న గారూ ఇచ్చారు.

ఇందాకే ఇందిర గారు వచ్చారు. కొత్త 'ఫ్లాట్' అమ్మకానికి వచ్చిందని చెప్పారు. మనవద్ద డబ్బు లేదని వద్దన్నాను. ఈ డబ్బు దానికి కట్టండి అంటున్న 'వసంత' మాటలకు నోరు తెరుచుకుండిపోయాడు ఆనంద్.

లక్కరాజు శ్రీదేవి
నర్సాపూర్.





## దురదృష్టం

చిన్న ప్రయివేటు హాస్పిటల్‌లో...జనరల్‌వార్డుకి కాస్త దూరంగా పచ్చని మైదానంలో... కూర్చోవడాన్కి అనువుగా ఉన్న సిమెంట్ బెంచీలో ఓ మనిషి ఎందుకో ఆలోచనలు ఎవరికో నిరీక్షణ! ఒంటరితనంతో కాలక్షేపం లేక కళ్ళు మూసుకున్నాడు కాస్సేపు. ఒరే బుజ్జి పండూ! ఎంత అందంగా ఉన్నావురా! పిచ్చివెధవ... ఇంతందంతో పాటు అన్నీ మంచి లక్షణాలు ఉండాలిరా! నీవెలా చదువుతావో ఏంటో? బాగా చదవాలి అందరూ ఈర్ష్య పడేలా చదవాలి. ఫస్టుమార్కులు రావాలి. అందరిచేత శహబాష్ అనిపించుకోవాలి. అన్నిట్లోను మంచి రాంకులు రావాలి. చక్కగా ఇంజనీరింగ్‌లో సీటు సంపాదించాలి. అదేవిట్రా అలా చూస్తున్నావ్! ఇంజనీరింగ్ చదవవా? ఎం.బి.బి. యస్ చదువుదువు గాని లే! ఆ..ది...అలా నవ్వాలి. చదివేటవుడు లవ్‌లు గివ్‌లు చేయకూడదు సుమా! ఆడపిల్లల వలపువలలో చేపల్లా పడకుండా చూస్కోవాలి. అందాన్ని ఎరవెడ్తారు జాగ్రత్త సుమా! మెడిసిన్‌లో గ్రాడ్యుయేట్ అయివచ్చిన తర్వాత నన్ను మీ అమ్మని బాధ పెట్టకుండా 'బంగారపు రజను' లా చూసుకోవాలి. ఇన్ని మంచి లక్షణాలుంటే గాని సరిగా కట్నం రాదు. పెళ్లి అవగానే సరిపోదు మంచి కట్నం రావాలి కదా! అందుకే మంచిగా నడచుకోవాలి. లక్ష..రెండు లక్షలు..మూడు లక్షలు.. పెద్ద ఎస్టేట్ పాట పాడినట్టు పాటలా నీ కట్నం పెరిగిపోవాలి. మైనస్‌లు, డివైడెడ్‌బైలు కాకుండా మల్టిప్లికేషన్ లా పెరిగిపోవాలి.

సంవత్సరానికి గోల్డుచైను, వినాయక చవితికో రిస్టువాచ్, దీపావళికి టి.వి., సంక్రాంతికో స్కూటరు, ఇంకా ఎన్నో బహుమతులు రావాలి..అంటూ ఏదో ఊహాలోకంలో విహరిస్తున్న లక్ష్మీకాంత్, సార్! అన్న పిలుపుతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

సార్!మిమ్మల్నే సార్ మీ భార్యకు 'ఆడబిడ్డ' అంటూ నర్స్ చెప్పేసరికి, వాట్! ఆడపిల్ల! బేడ్‌లక్...కలంతా కల్లేనా? వినపడి వినపడనట్లుగా అనుకుంటూ, వివర్ణమైన ముఖంతో నర్సువైపు నీరసంగా చూచాడు.

అంగరగోపాలకృష్ణ
మండపేట.